www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 నవంబర్ 2025
5
ఏలూరు

పట్టిసీమ నుండి 700 క్యూసెక్కుల జలాలు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుండి 2,120 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు సోమవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిఇ సురేష్ బాబు తెలిపారు. గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉండడం వల్ల, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 6 మోటార్ల ద్వారా కృష్ణా డెల్టాకు నీటి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



డెలివరీ పాయింట్ వద్ద విడుదలవుతున్న జలాలు

సమస్యలు వింటారు.. పరిష్కరించరు..!

'నా పేరు వీరవల్లి శంకర్రావు, జంగారెడ్డిగూడెం నివాసిని. 90 శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ టైలరింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నాను. మూడు చక్రాల వాహనం ఇస్తే నా పనికి మరింత ఉపయోగంగా ఉంటుందని మూడేళ్లుగా తిరుగుతున్నాను. ఇదిగో అయిపోయింది.. అదిగో వచ్చేసిందనడమే తప్ప ఇప్పటికీ మూడు చక్రాల వాహనం మాత్రం రాలేదు. మరోసారి జిల్లా అధికారులను కలిసి విన్నవించేందుకు వచ్చాను. ఈసారైనా నా పని చేస్తారో లేదో తెలియదు'.

'నా పేరు నంబూరి భూసరాజు. ఉంగుటూరు మండలం నారాయణపురం. వయస్సు 65 ఏళ్లు. పింఛన్ కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాను. సొంతిల్లు లేదు. కూలి పని చేస్తే తప్ప ఇల్లు గడవదు. అధికారులను ఎన్నిసార్లు కలిసినా పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది'.

పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై జనం ఆవేదన
ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యలకు మోక్షం కరువు
ప్రతివారం జిల్లా కేంద్రానికొచ్చి 300కుపైగా అర్జీలు సమర్పణ
పరిష్కారంలో మాత్రం అత్యంత పేలవంగా అధికారుల తీరు
కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మరింత దారుణమని విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న శంకర్రావు, భూసరాజులే కాదు. పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన మూడొంతులు మంది పరిస్థితి ఇలానే ఉంది. ఏళ్ల తరబడి తిరుగుతున్నా పిజిఆర్ఎస్‌లో ఇచ్చిన సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 300కుపైగా అర్జీలు వస్తున్నాయి. జిల్లా కలెక్టర్, జెసి, డిఆర్ఒ, ఆర్‌డిఒ వంటి ఉన్నతాధికారులు ఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తున్నారు. అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదు ఏ శాఖకు చెందితే సంబంధిత అధికారిని పిలిచి సమస్యను పరిష్కరించాలని చెప్పి ఫిర్యాదును అప్పగిస్తున్నారు. సమస్యను బట్టి 30 రోజుల నుంచి 105 రోజుల వరకూ గడువు విధిస్తున్నారు. ఇక్కడ వరకూ బాగానే ఉంటుంది. జిల్లా అధికారులు జనం నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత మండలాధికారులకు పంపిస్తున్నారు. అక్కడ షరా మామూలు అన్నట్లు మారిపోతుంది. అప్పటికే జనం సంబంధిత సమస్యలపై గ్రామ, మండలాధికారులను కలిసి విన్నవించుకుంటున్నారు. వారు పట్టించుకోకపోవడంతో జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. మళ్లీ వారి వద్దకే ఫిర్యాదు వెళ్లడంతో వారు అదే రీతిన వ్యవహరిస్తున్నారు. గడువు ముగిసే రెండు రోజుల ముందు పరిశీలనకు వెళ్లి ఫొటోలు తీసుకుని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సమస్యను పరిష్కరించడం వదిలేసి ఏదోక సమాధానం రాసి పంపించేస్తున్నారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందినట్లు సంతకం చేయాలని నిబంధన ఉన్నా అవేమీ పట్టించుకోవడం లేదు. ఫిర్యాదుదారులు సంతకం పెట్టకపోయినా ఫిర్యాదును ముగించేస్తున్నారు. పిజిఆర్ఎస్ విభాగం నుంచి ఫోన్ వచ్చినప్పుడు ఫిర్యాదుదారులు సమస్య పరిష్కారం కాలేదని గగ్గోలు పెడుతున్నా ఫలితం మాత్రం ఉండటం లేదు. ముఖ్యంగా భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉంటుదనే విమర్శలు విన్పిస్తున్నాయి. గడువు ముగిసిన తర్వాత మళ్లీ పిజిఆర్ఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే కథ మళ్లీ మొదటికి వస్తోంది. గడువు ముగిసే వరకూ వేచిచూడటం, ఫిర్యాదును ముగించడం అధికారులకు అలవాటుగా మారిపోయింది. సమస్యను పరిష్కరించడం వదిలేసి ఉన్నతాధికారులకు నివేదించాం అంటూ జిమ్మిక్కులు ప్రయోగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులపై తిరిగి ఓపెన్ కాకుండా కోర్టు కేసులు వంటి పదాలు వాడుతూ ముగించేస్తున్న పరిస్థితులు ఉంటున్నాయి.



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

రోజంతా శ్రమించినా ఫలితం శూన్యం..

జిల్లా కేంద్రంలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి జనం వస్తున్నారు. ఉదయం బయలుదేరి ఎన్నో ఖర్చులు, వ్యయప్రయాసల పడుతూ ఏలూరు చేరుకుని ఫిర్యాదులు ఇస్తున్నారు. పిజిఆర్ఎస్‌కు వచ్చి ఫిర్యాదు ఇచ్చి తిరిగి వెళ్లేందుకు రోజంతా సరిపోతుంది. ఫలితం మాత్రం ఉండటం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. గతంలో కొంతమేర పర్వాలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నేరుగా కార్యాలయాలకు వెళ్లినా అధికారులను కలిసే పరిస్థితి ఉండటం లేదు. ఎప్పుడు వెళ్లినా ఆన్‌లైన్ మీటింగ్‌లో ఉన్నారంటూ వెనక్కి పంపిస్తున్న పరిస్థితి ఉంటోంది. దీంతో సమస్యలు పరిష్కారం కాక జనం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మొక్కలు నాటిన కలెక్టర్, జెసి, డిఆర్ఒ

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులవ్వాలి

విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిఒక్కరూ మొక్కటు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా చూడాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరం ఆవరణలో సోమవారం కార్తీక సమారాధన మహోత్సవం-2025లో భాగంగా జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ సంయుక్తంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్తీక వనసమారాధన మహోత్సవంలో మొక్కలు నాటడం పర్యావరణ పరిరక్షణకు ఒక ముఖ్యమైన భాగమన్నారు. మొక్కలు నాటడం ఒక అలవాటుగా చేసుకోవాలని, ప్లాస్టిక్, క్యారీ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జిల్లా అటవీ శాఖాధికారి సిహెచ్.సూర్యనారాయణ, జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్‌వి.నాంచారయ్య, అటవీశాఖాధికారులు ఎస్‌వి.కుమార్, పి.మోహిని విజయలక్ష్మి, అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి: కలెక్టర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి, అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. అర్జీల పరిష్కారంలో పోటీతత్వం ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకీదేవి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో శాఖల వారీగా వచ్చిన అర్జీలను జాగ్రత్తగా పరిశీలించి నిర్ణీత సమయంలోనే తక్షణ పరిష్కారం చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలని అన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

పిఆర్ 126 రకం సాగుకు అనుమతివ్వాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పిఆర్ 126 రకం వరి విత్తనం సాగు, కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, రైతులు విత్తనాలు సిద్ధం చేసుకున్న నేపథ్యంలో ఈ రబీ సాగు వరకు అనుమతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ వెట్రిసెల్వికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో వరి కోతలు అనేక ప్రాంతాల్లో ముమ్మరంగా సాగుతున్నాయని, తిరిగి రబీ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారని చెప్పారు. ఇప్పటికే రైతులు రబీ సాగుకు తెగుళ్ల తక్కువ, అధిక దిగుబడి, తక్కువ కాలంలో పంట వస్తుందని పిఆర్ 126 రకం వరి విత్తనాలు సిద్ధం చేసుకున్నారని వివరించారు. అయితే ఈ విత్తనం సాగు తగ్గించాలని, ప్రభుత్వం కొనుగోలు చేయదని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారని, దీంతో రైతుల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. పిఆర్ 126 వరి రకం విత్తనాలు సాగు తగ్గించాలంటే ఖరీఫ్ సాగుకు ముందే చెప్పాలి తప్ప ఆ విత్తనాన్ని విత్తన పంటగా సాగు చేసి విత్తనాలు సిద్ధం చేసుకున్న తర్వాత చెప్పడం వల్ల రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిఆర్ 126 వరి విత్తనం సాగుకు పూర్తిస్థాయిలో అనుమతులు ఇచ్చి, ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి స్పందిస్తూ ప్రత్యామ్నాయ విత్తనాలు సాగు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా రైతులతో మాట్లాడుతూ పిఆర్ 126 విత్తనాల వల్ల కొన్ని సమస్యలు ఉన్నాయని, అయితే విత్తనానికి ప్రత్యామ్నాయ విత్తనాలను సిద్ధం చేస్తామని, ఆ విత్తనాలు సాగు చేసుకోవాలని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గండి రాజా, నాగరాజు, ఎస్.వెంకట్రావు, వి.రామారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి అందిస్తున్న నేతలు

కొల్లేరులో రబీ సాగుకు అనుమతివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరుపై ఆంక్షలు ఎత్తివేయాలని, కొల్లేరు రైతులపై అటవీ శాఖ అధికారుల వేధింపులు నిలిపివేయాలని, రబీలో వరి సాగుకు అనుమతి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరును ఆనుకుని ఉన్న అడవికొలను, పెదనిండ్రకొలను, తోకపల్లి, బైనేపల్లితోపాటు పలు గ్రామాల్లో చేపల చెరువులు వంటివి తవ్వకాలు చేయకుండా మూడు వేల ఎకరాలకుపైగా వందల ఏళ్ల నుండి వరి సాగు మాత్రమే చేస్తున్నారని పేర్కొన్నారు. కొల్లేరు పల్లపు ప్రాంతం కావడంతో ఖరీఫ్‌లో సాగు సాధ్యం కాదని, అందుకే కొల్లేరును ఆనుకుని ఉన్న అన్‌సర్వే భూముల్లో దాళ్వా మాత్రమే పండుతుందని తెలిపారు. ఇప్పుడు అటవీశాఖ అధికారులు ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రబీ సాగు చేస్తున్న భూముల్లోకి వెళ్లొద్దని ఆంక్షలు విధించడం అన్యాయమని పేర్కొన్నారు. కొల్లేరు రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతన లేకుండా ఉందని విమర్శించారు. కొల్లేరులో సంప్రదాయబద్ధంగా వ్యవసాయం చేసుకోవచ్చని కోర్టులు చెబుతున్నా అటవీ శాఖాధికారులు ఆంక్షలు విధించడం దారుణమని పేర్కొన్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని అసెంబ్లీలో రెండుసార్లు తీర్మానం చేసినా, ఎన్నికల సమయంలో మోడీ హామీ ఇచ్చినా, కేంద్ర సాధికారిక కమిటీకి ఎంఎల్‌ఎలతో సహా కొల్లేరు పెద్దలు, ప్రజలు వినతిపత్రాలు అందించినా సమస్యను పరిష్కరించడం లేదని దుయ్యబట్టారు. 20 ఏళ్లుగా లేని ఆంక్షలు ఇప్పుడు కొత్తగా వరి సాగుకు ఎందుకు పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. సాధికారిక కమిటీ పర్యటన అనంతరం కొల్లేరు ప్రజలకు మేలు జరుగుతుందని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చెప్పడం మోసపూరితమని ఈ చర్యతో వెల్లడవుతుందని పేర్కొన్నారు. కొల్లేరులో రబీ సాగుకు అవకాశం కల్పించాలని, అటవీ శాఖ అధికారుల వేధింపులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కొల్లేరు ప్రజలను, రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ నిర్లక్ష్యం

ఐదు గంటల పాటు బాలింత నిరీక్షణ

ఏలూరు అర్బన్ : తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఐదు రోజుల పాపతోపాటు పచ్చి బాలింత ఐదు గంటల పాటు తిండి తిప్పలు లేకుండా నిరీక్షించాల్సిన పరిస్థితి ఏలూరులో సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి, శిశుఆరోగ్య కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పెదవేగి మండలం కూచింపూడి గ్రామ సమీపంలోని న్యాయంపల్లి గ్రామానికి చెందిన సుప్రియ ప్రసవం కోసం ఈనెల 12వ తేదీన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రసూతి, శిశుకేంద్రంలో జాయిన్ అయ్యి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన బిడ్డ తక్కువ బరువుతో పుట్టడంతో పాటు కామెర్లు లక్షణాలు ఉండటంతో పుట్టినప్పటి నుంచి ఆరు రోజులపాటు బిడ్డను ఇంక్యుబేటర్‌లో ఉంచి చికిత్స అందించారు. తల్లిని విడిగా వార్డులో ఉంచారు. బిడ్డ ఆరోగ్యం మెరుగుపడటంతో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు డిశ్చార్జి చేశారు. ఆరు రోజులపాటు బిడ్డకు దూరంగా ఉన్న ఆ తల్లి బిడ్డను తీసుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైంది. అయితే బాలింతను, బిడ్డను ఇంటికి చేర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ సకాలంలో రాలేదు. రెండు గంటలకు డిస్చార్జ్ చేసినప్పటికీ మరో గంట ఎదురు చూసిన తర్వాత మూడు గంటలకు తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్ ఫోన్ చేసి కిందికి దిగి వచ్చేయాలని చెప్పటంతో వార్డు నుంచి కిందికి దిగి వాహనం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. అయితే మూడు గంటలు గడిచినప్పటికీ వాహనం రాలేదు. డ్రైవర్‌కి ఫోన్ చేస్తే డిఎంహెచ్ఒ ఆఫీసులో ఉన్నానని, మీటింగ్‌లో ఉన్నానని, మేడం పని మీద ఉన్నానని, వెయిట్ చేయాలని రకరకాల కారణాలు చెప్పటంతో పాటు పచ్చి బాలింతపై అసహనం వ్యక్తం చేయటం జరిగింది. అయినప్పటికీ సహనంతో తిండి తిప్పలు లేకుండా దోమలతో బాధపడుతూ అలాగే వాహనం కోసం ఎదురుచూశారు. త్వరగా రావాలని మరోసారి డ్రైవర్ కు ఫోన్ చేస్తే 'కంగారు ఏంటి, అవసరం అయితే రేపు దింపుతాను, రేపు వెళ్లండి' అంటూ డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం జరిగింది. దీంతో ఆరు గంటల వరకు ఎదురుచూసిన వారు పోలీస్ శాఖలో వారి బంధువులు ఉంటే వారికి చెప్పటం, వారు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేయటం, సూపరింటెండెంట్ ఒక మహిళ డాక్టర్‌కు ఫోన్ చేసి పరిస్థితి పర్యవేక్షించాలని చెప్పటం జరిగింది. అయితే ఆ మహిళ డాక్టర్ వచ్చి కైకలూరు నుంచి మరో వాహనం వస్తుందని అందులో వెళ్లాలని చెప్పి వెళ్లిపోయారు. దీంట్లో ఆ వాహనం కోసం మరో గంట ఎదురు చూసి చివరికి రాత్రి 7 గంటలకు ఆ వాహనం రావడంతో కూచిపూడి బయలుదేరి వెళ్లారు. బాలింత, ఆరు రోజుల పసిబిడ్డతో పాటు మూడు సంవత్సరాల బాబు, సుప్రియ అత్తతో సహా 5 గంటల పాటు తిండి తిప్పలు లేకుండా దోమలతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో బాలింతలను ఇంటికి చేర్చాల్సిన డ్రైవర్లు సొంత పనులతో, ఇతర కారణాలతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని, ఈ విషయంలో ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని సుప్రియ కోరుతుంది.

బిడ్డతో నిరీక్షిస్తున్న బాలింత

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని అడవి కొలను గ్రామ పంచాయతీ పరిధిలో. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆ గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణరావు మాట్లాడుతూ అడవికొలను గ్రామ పరిధిలోని గరువు ప్రాంతంలో మూడేళ్లుగా తాగునీటి సమస్య నెలకొందన్నారు. దీనిపై అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న దాఖలాల్లేవని, అక్కడి చెరువులోకి డ్రెయినేజీల్లోని మురుగునీరు చేరడంతో కలుషితమైందని తెలిపారు. ఆ నీటిని శుద్ధి చేయకుండా పైపుల ద్వారా సరఫరా చేస్తున్నారని, ఆ నీరు తాగడానికి కాదుకదా వాడకానికి పనికి రాని పరిస్థితి ఉందన్నారు. ఆ నీటితో స్నానం చేస్తే ఒళ్లంతా దద్దుర్లు వచ్చి రోగాల పాలవుతున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వం చెరువుల నీటి కాలుష్యాన్ని అరికట్టి, శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోన శ్రీనివాసరావు, లావేటి సోంబాబు, పంచాయతీ వార్డు సభ్యుడు తింటూ కనకారావు, పూడి త్రిమూర్తులు, కె.రమణ, కె.అరుణ, నాగలక్ష్మి, దేవి, సింహాచలం, వేణు తదితరులు పాల్గొని మాట్లాడారు.

నినదిస్తున్న అడవికొలను గ్రామస్తులు, సిపిఎం నేతలు

వృద్ధులను గౌరవించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వృద్ధుల పట్ల జాలి, దయ చూపటం కాదని, ప్రేమ ఆప్యాయతలను పంచి సమాజంలో గౌరవంగా జీవించేలా చూడాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. మండలంలోని వెంకటాపురం ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వయోవృద్ధుల హక్కులు, చట్టాలపైన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈరోజు ప్రేమాలయంలోని వయోవృద్ధులకు ఈ అవగాహన సదస్సును నిర్వహించామని తెలిపారు. వయోవృద్ధులు వారి పిల్లల నుండి సంరక్షణ, పోషణ లోపం అయిన వారి నుంచి భరణం ఇప్పించడం, పిల్లలకి ఇచ్చిన ఆస్తులు గిఫ్ట్ డీడ్‌ను రద్దు పరచడం, తిరిగి తల్లిదండ్రులకు చెందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అవసరమైతే ఆ బాధ్యతలను న్యాయ సేవాధికార సంస్థలు తీసుకుంటాయని, అటువంటి సమస్యలు ఉన్నవారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. అవసరమైన వారికి ఉచిత న్యాయవాదిని నియమించి వారి కేసులను ముందుకు తీసుకువెళ్లి, వారిని అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ప్రేమాలయం గౌరవాధ్యక్షులు టివిఆర్.గురూజీ, ప్రెసిడెంట్ టి.సుబ్బారావు, సెక్రటరీ రాంబాబు పాల్గొన్నారు. తదనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ స్థానిక ప్రత్తెబాదలో ఉన్న పట్టణ నిరాశ్రయుల వృద్ధుల ఆశ్రమంలో వయో వృద్ధుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించి, చట్టాలపై అవగాహన కలిగించారు. సంక్షేమ పథకాలు పొందటంలో కాని మరి ఏఇతర సమస్య ఎదురైనను జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ పి.వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ అశోక్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం నూజివీడు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యాన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అండ్ మెయిన్టనెన్స్ చట్టంపై 15వ జిల్లా అదనపు జడ్జి ఎ.నాగ శైలజ అవగాహన కల్పించారు. ఈ చట్టంలో వృద్ధులకు ఉన్న హక్కులను వారి పిల్లల నుండి వారు కోరదగిన పరిహారాలను అనగా మెయింటెనెన్స్ సరైన వైద్యం చేయించడం, వారిని సరిగా చూసుకోవటం, ఆవాసం కల్పించడం హక్కుల గురించి వివరించారు. ఈ హక్కులకు భంగం కలిగించినప్పుడు వృద్ధులను స్పెషల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి రిలీఫ్ పొందవచ్చని అన్నారు.

భీమడోలు : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందని భీమడోలు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎస్.ప్రియదర్శిని నూతక్కి అన్నారు. భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయం వేదికగా జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ సౌజన్యంతో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కె.గీతాంజలి న్యాయవాదులు ఎస్.గోపికృష్ణ, ఎల్.సుధారాణి, టి.రాణి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మాట్లాడుతున్న శ్రీదేవి

సీడ్ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలి

రైతులకు న్యాయం చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

ద్వారకాతిరుమల: మండలంలోని హనుమాన్‌గూడెం గ్రామంలో మొక్కజొన్న రైతులు సీడ్ ఆర్గనైజర్ చిలక అప్పారావు చేతిలో మోసపోయారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. తహశీల్దార్‌కు తమ గోడు చెప్పుకున్నారు. స్థానిక వ్యవసాయాధికారి సైతం తామేమీ చేయలేమంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కంపెనీల పేర్లు లేకుండా స్థానికంగా మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్లు విత్తనాలు అమ్ముతూ అమాయకులైన కొందరు రైతులను మోసగిస్తున్నారన్నారు. స్థానిక వ్యవసాయ అధికారులకు వీరిపై ఎలాంటి నియంత్రణా లేదని, దాంతో రైతులు దారుణంగా మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కంపెనీలకు అనుకూలంగా ఉంటూ చట్టాలు చేస్తుంది తప్ప రైతులకు అనుకూలంగా నిర్ణయాలు చేయకపోవడం విచారకరమన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న నేతలు

అంతర్జాతీయ స్థాయి లక్ష్యంగా కృషి

ఆర్చరీ గోల్డ్ మెడలిస్ట్ ధీరజ్

నూజివీడు టౌన్ : అంతర్జాతీయ స్థాయి సాధించే దిశగా కృషి చేస్తున్నట్లు ఆర్చరీ గోల్డ్ మెడలిస్ట్ ధీరజ్ తెలిపారు. ధీరజ్ నూజివీడు విచ్చేసిన సందర్భంగా సోమవారం మాట్లాడారు. విలువిద్యను చూసి ఆసక్తి పెరగడంతో, ఆర్చరీ ప్లేయర్‌గా ఎదగాలనే లక్ష్యం ఏర్పడినట్లు తెలిపారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న గేమ్ కావడంతో తన తల్లి తాళిబొట్టు తాకట్టు పెట్టి తనను ఆడించిన సంగతి ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. తనపై తన తల్లిదండ్రులకు ఉన్న నమ్మకం, కోచ్ అందించిన శిక్షణ, ప్రోత్సాహంతో ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేస్తున్నట్లు వివరించారు. ఇతర దేశాలలో మాదిరిగా మనదేశంలోనూ ఆర్చరీ క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందించాలని కోరారు. భవిష్యత్తులో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులను ప్రోత్సహించి, తన వంతు సహాయ సహకారం అందిస్తానన్నారు.

ఎస్‌టి కమిషన్ సభ్యులకు జగదీశ్వరి సత్కారం

ప్రజాశక్తి - పోలవరం

ఎస్‌టి కమిషన్ సభ్యులను ఎపి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కొవ్వాసు జగదీశ్వరి సత్కరించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం లో సోమవారం జరిగిన ఎస్‌టి కమిషన్ ఛైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి, సభ్యులు వెంకటప్ప, కాకి లక్ష్మిలకు జగదీశ్వరి శాలువాలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషన్ గిరిజనుల సంక్షేమంతోపాటు విద్య, ఉపాధి రంగాల్లో గిరిజనులకు ఉపయోగపడే చర్యలు తీసుకోవాలని జగదీశ్వరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు భుక్యా విజయనాయక్ తదితరులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న జగదీశ్వరి

రేపు జనవాణి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈనెల 19వ తేదీన ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక లక్ష్యంగా జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కార్యాలయం సోమవారం ప్రకటనలో పేర్కొంది. నియోజకవర్గంలో ప్రజల నుండి సమస్యలను సంబంధించిన వినతులు, విజ్ఞాపనలు స్వీకరించి వివిధ శాఖల అధికారుల పరిధిలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ ధర్మరాజు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన వెల్లడించారు.

డప్పు కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పోలవరం నియోజకవర్గంలో కొయ్యలగూడెం ప్రాంతానికి చెందిన 30 మంది ఎస్‌సి, ఎస్‌టి డప్పు కళాకారులు పెన్షన్ దరఖాస్తుల కోసం ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వ మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్డి మేఘలాదేవికి విన్నవించారు. ఈ సందర్భంగా మేఘలాదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాదిగలకు పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించిన వెంటనే 45 సంవత్సరాలు నిండిన డప్పు కళాకారులకు పెన్షన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - చింతలపూడి

ఎస్‌టియు నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. చింతలపూడిలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ముప్పిడి శామ్యూల్ అధ్యక్షతన మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎం.ప్రభాకర్, జనరల్ సెక్రటరీగా నాని సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

హీమోఫీలియా-బి బాధితుడికి శస్త్రచికిత్స

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో హీమోఫీలియా-బి బాధితుడికి విజయవంతంగా ప్రధాన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స ఆదివారం నిర్వహించారు. తాపేస్వరం ప్రాంతానికి చెందిన 74 ఏళ్ల వృద్ధుడు ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పరీక్షల్లో అతనికి ఎడమ తొడ ఎముక నెక్ వద్ద బేసల్ ఫ్రాక్చర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. రక్తం గడ్డకట్టడంలో లోపం కనిపించడంతో బాధితుడిని హీమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్‌కు రిఫర్ చేశారు. హీమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్ కార్యదర్శి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు ఛైర్మన్ డాక్టర్ మాగంటి ప్రసాద్ ఈ కేసు తెలిసిన వెంటనే వేగంగా స్పందించి ఏలూరు రెడ్ క్రాస్ సొసైటీ నుంచి ల్యాబ్ టెక్నీషియన్‌ను బాధితుడి ఇంటికే పంపించి రక్త నమూనా సేకరించారు. పరీక్షల్లో బాధితుడు హీమోఫీలియా-బి తో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. పరీక్ష ఫలితాలు వచ్చిన వెంటనే డాక్టర్ మాగంటి ప్రసాద్ అత్యవసరంగా ఫ్యాక్టర్-9 ఇంజెక్షన్లను వెంటనే ఏర్పాటు చేసి, బాధితుడికి ప్రారంభ చికిత్స అందించి, ఏలూరులోని మహాలక్ష్మి ఆస్పత్రి ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ ఎమ్.ఎ.మహాదేవ్‌కు రిఫర్ చేశారు. ఆయన పరిశీలన అనంతరం మేజర్ ఆర్థోపెడిక్ సర్జరీ తప్పనిసరి అని నిర్ణయించి ఆదివారం సాయంత్రం శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్రచికిత్సకు కావాల్సిన మొత్తం ఫ్యాక్టర్-9 ఇంజెక్షన్లను ఏలూరు రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ మాగంటి ప్రసాద్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సమకూర్చడంతో పలువురు ఆయనను ప్రశంసించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న బాధితుడు ప్రస్తుతం ఆరోగ్యంగా కోలుకుంటున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

నిర్ణీత సమయంలోనే సమస్యల పరిష్కారం : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ వినూత్న తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయడం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగానే అన్ని సమస్యలు పరిష్కరించటం జరుగుతున్నదన్నారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తున్నామన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 46 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితోనే పెట్టుబడులు : ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రానికి చంద్రబాబునాయుడు పేరే ఒక బ్రాండ్ అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ, గన్ని వీరాంజనేయులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ విశాఖ సిఐఐ భాగస్వామ్య సదస్సులో 13.25 లక్షల కోట్ల ఒప్పందాలు కుదిరిందంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషి అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం సాధారణ విషయం కాదని, రిలయన్స్, మిట్టల్, గూగుల్ వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులకు ముందుకు రావడం రాష్ట్ర పురోగతిని సూచిస్తుందన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే పలు పరిశ్రమలకు శంకుస్థాపన జరిగిందని, త్వరలో మరో నాలుగు పరిశ్రమలు రాబోతున్నాయని ఎంపీ తెలిపారు. పరిశ్రమలు, సంక్షేమం రెండు కలిసి నడిస్తేనే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేదని విమర్శించారు. నారా లోకేష్ చేపట్టిన ట్రిపుల్ టైమ్ అనుమతుల విధానం వల్ల పరిశ్రమలు క్యూ కడుతున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న చంద్రబాబు, లోకేష్, ప్రధాని మోడీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.

వికలాంగ విద్యార్థులకు ఉచిత ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడులో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్ అవకాశాల అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి అధికారులు క్యాంపస్‌ను సందర్శించారు. సోమవారం మినీ ఎస్ఎసి ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన చర్చా కార్యక్రమంలో శారీరక అంగ వైకల్యం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం తరఫున అందించే అవకాశాల గురించి తెలియజేశారు. ఈ అవగాహనా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్ష సీనియర్ అడ్మినిస్ట్రేటర్ రామ్ కమల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వికలాంగ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పాటు నైపుణ్యాలను పెంచి వాళ్లకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఆర్‌జియుకెటి నూజివీడులోని ఎంఎంఇ డిపార్ట్‌మెంట్‌లో బిటెక్ పూర్తిచేసి ప్రస్తుతం ఎంబిఎ చదువుతున్న ప్రశాంత్ తనలాంటి అంగవైకల్యం కలిగిన విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని గుర్తుచేశారు. ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్, ఇబిటిపి డీన్ డాక్టర్, సెంట్రల్ అకడమిక్ డీన్ ఫ్రాన్సిస్, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జునరావు, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, డీన్ డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని సుంకొల్లు గ్రామంలో గల కోడిపందేల శిబిరంపై నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఏడుగురు, ఒక కోడిపుంజు, రూ.7,600 నగదు, 8 బైకులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఎవరైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలలో పాల్గొంటే తమ గ్రామాలలో ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు కాని డయల్ 112కు సమాచారం అందించాలని అన్నారు. ఈ దాడులలో వ్యక్తులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని రూరల్ సిఐ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

పోలీస్ స్టేషన్ పరిధిలో బలివే గ్రామంలో పేకాట శిబిరంపై స్థానిక ఎస్ఐ ఎం.చిరంజీవి, వారి సిబ్బందితో కలిసి బలివే గ్రామ శివారులో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడులు చేసి 05 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.7,400 నగదు, 07 మోటార్ సైకిల్స్, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

ఎస్ఐ ఎం.చిరంజీవి

చిట్ - చాట్

ప్రజాశక్తి - ముసునూరు

శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తమ సిబ్బందితో సహా కృషి చేస్తామని ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో పలు అంశాలు మాట్లాడారు.

ప్రశ్న : ముసునూరు మండలంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత మీ ప్రాధాన్యత ఏమిటి?

ఎస్ఐ : ప్రజలతో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పటం. నేరాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం మొదటి కర్తవ్యం. ప్రజలు భయపడకుండా పోలీసులను సంప్రదించేలా నమ్మకం పెంచడం.

ప్రశ్న : ప్రస్తుతం మండల పరిధిలో శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉంది?

ఎస్ఐ : మండలంలోని గ్రామాల్లో ఎక్కడా పెద్దగా సమస్యలు లేవు. పోలీసు సిబ్బంది రోజూవారి పర్యవేక్షణ చేస్తూ నేరాలపై నిఘా కొనసాగిస్తున్నాం. పండుగలు, రాజకీయ సభలు, సామాజిక కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు అదనపు సిబ్బందిని నియమించి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న : నేరాల నియంత్రణలో పోలీసులు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఎస్ఐ : సీసీ కెమెరాల ద్వారా మండలం మొత్తాన్ని పర్యవేక్షిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ముఖ్యమైన రోడ్ల కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నాటు సారాయి, మద్యం, గంజాయి, జూదం, సైబర్ నేరగాళ్లు, గేమింగ్ వంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దళాల సహాయంతో కట్టడి చర్యలు చేపడుతున్నాం. మండలంలో ఉన్న పలు గ్రామాల్లో రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎవరైనా నేరాలకు పాల్పడితే వెంటనే వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నాం.

ప్రశ్న : మహిళలు, విద్యార్థుల భద్రతపై మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎస్ఐ : పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అలాగే డయల్ 100, 112 ద్వారా ఎప్పుడైనా సహాయం అందుబాటులో ఉంటుంది. ఏ సమస్య వచ్చినా భయపడకుండా తమ ఫోన్ నెంబర్ 9440796441కు డయల్ చేసి సంప్రదించాలి.

ప్రశ్న : మండలం, గ్రామాల్లో ప్రజల సహకారం ఎలా ఉంది?

ఎస్ఐ : చాలా బాగుంది. మండల ప్రజలు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రజల సహకారం వల్లే శాంతి భద్రతలు నిలుస్తున్నాయి.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సందేశం ఏంటి?

ఎస్ఐ : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కూడా కోర్టు జైలు శిక్ష విధిస్తుంది. కావున అలాంటి వాటికి దూరంగా ఉండాలి. మద్యం తాగి వాహనాలు నడపవద్దు, నేరాలకు పాల్పడి మీ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు.

కొనసాగిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం కమిటీ ఛైర్మన్ తనగాల అనిల్ తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం చింతలపూడి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కమిటీ ఛైర్మన్ అనిల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభని బయటకు తీయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్.వర్మ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఏలూరు బాలల గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం బాలికలు, మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.త్రిపుర సుందరీ దేవి ప్రసంగిస్తూ బాలికల విద్య ప్రాముఖ్యత గురించి, మహిళలు చదువుకోవడం వల్ల సమాజంలో జరిగే మార్పు గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో ఉదయం జూనియర్ విద్యార్థులకు చిత్రలేఖనం, శతక పద్య పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం సీనియర్ విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధుల ముఖచిత్రాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముదినేపల్లిలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి ఎ.వెంకటేశ్వరరావు చాణక్య ఏకపాత్రాభినయ సంభాషణలు వినిపించి విద్యార్థులను ఆనందింపచేశారు. కార్యక్రమంలో కొత్తూరు వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు, ఆయా గ్రంథాలయాల నిర్వహకులు శ్రీదేవి, ఝాన్సీ పాల్గొన్నారు.

టి.నరసాపురం : చిత్రలేఖనం విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పురం శ్రీనివాస్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి సృజనాత్మకతను, కళా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, విజన్ యుపి స్కూల్ ఉపాధ్యాయిని కె.మహాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ రసన సాహితి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన వివిధ పాఠశాలల విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు, వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎమ్.శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. 'రసన' అధ్యక్షులు బాలిన సత్యనారాయణ న్యాయనిర్ణేతగా పాల్గొన్నారు. మధ్యాహ్నం గ్రంథాలయోద్యమకారులు, గ్రంథాలయశాస్త్ర పితామహులు ఎస్ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణంలను స్మరించుకుంటూ సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. అతిథులుగా స్టేట్ ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ బి.శాంతిరాజు, ఏలూరు జూనియర్ కళాశాల లైబ్రేరియన్ పి. జ్యోతి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో యువత పాత్ర - ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు అనే అంశంపై కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు తెలిపారు. న్యాయ నిర్ణేతగా స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ సోషల్ అసిస్టెంట్ కె.రాజ్‌కుమార్ వ్యవహరించారు. పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జెసిబితో తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

గురజ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి - ముదినేపల్లి

గురజ గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన గ్రామంలోని రెండు శ్మశాన వాటికల్లో సోమవారం జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఒసి, ఎస్‌సి శ్మశాన వాటికల్లో దట్టంగా ముళ్లపొదలు పెరిగిపోయాయి. దీంతో మృతదేహాల దహనం, ఖననం చేసే సమయంలో ముండ్ల కంపలు అడ్డంకిగా మారాయి. దీంతో మృతదేహాలు ఖననం, దహనం చేసేటప్పుడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు శ్మశాన వాటికల్లో దట్టంగా పెరిగిన ముండ్ల చెట్లు, కంపలను జెసిబితో జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఈ పనులను గ్రామ సర్పంచి మంచాల సరస్వతి, గ్రామాభివృద్ధి అధికారిణి ఎస్.హారిక పర్యవేక్షించారు.

జెడ్‌పి స్కూల్ సందర్శన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ప్లస్-2 పాఠశాలను సోమవారం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆర్.ఆశాలత, కొయ్యలగూడెం డివైఇఒ రామన్నదొర, బుట్టాయగూడెం ఎంఇఒ-1 టి.బాబూరావు, ఎంఇఒ-2 సిహెచ్.నరేంద్రరాయ్ సందర్శించారు. రాబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రంగా ఏర్పాటు చేసిన తరగతి గదులను వారు పరిశీలించారు. ఈ సందర్శనలో అధికారులు ప్రతీ పరీక్షా హాలును పరిశీలిస్తూ విద్యార్థులు కూర్చునే ఏర్పాట్లు, వెలుతురు, గాలి ప్రసరణ, తాగునీటి సౌకర్యం, సీసీ టివి అమరికలు, పరీక్షల నిర్వహణకు అవసరమైన ఇతర ప్రమాణాలను పరిశీలించారు. పాఠశాల సిబ్బంది చేసిన ఏర్పాట్లను అధికారులు ప్రశంసించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పరీక్షలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. రాబోయే 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఉద్దేశించి కొన్ని సూచనలను, సలహాలను ఇచ్చి వారు అత్యధిక మార్కులు సాధించడానికి కష్టపడి చదవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోకుంటే కోర్టులో పిటిషన్ వేస్తాం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రమాదాల నివారణపై ఎన్నిసార్లు చెప్పినా కూడా హైవే అథారిటీస్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, 15 రోజుల్లోగా అధికారులు చర్యలు తీసుకోకపోతే నేషనల్ హైవే అధికారులను, కాంట్రాక్ట్ సంస్థలను, సంబంధిత అధికారులను ప్రతివాదులుగా చేర్చుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం ఏలూరులోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన పలు ప్రజా సమస్యలపై పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికు వినతి పత్రాలు అందజేశారు. సంబంధిత నేషనల్ హైవే అధికారులపై చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మరో 15 రోజుల్లో హైవే అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, అవసరమైతే రోడ్ల మరమ్మతులు పూర్తయ్యే వరకు కూడా టోల్ ఛార్జీలు వసూలు చేయకుండా ఉండేలా కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, పర్వతనేనీ రామకృష్ణ, పరస వెంకట్రావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణవేణి అన్నారు. నూజివీడు పట్టణంలోని వాహనదారులకు హెల్మెట్, లైసెన్స్, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్‌లపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ రోడ్డుపైకి ద్విచక్ర వాహనం వస్తే తప్పనిసరిగా హెల్మెట్‌తో రావాలన్నారు.

150 ఏళ్ల దారిని కబ్జా చేశారు

సబ్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాట్లాడుతున్న రైతులు

మండలంలోని జంగంగూడెం గ్రామంలో 150 సంవత్సరాలుగా పంట భూములకు వినియోగిస్తున్న దారిని ఓ రైతు అడ్డుకోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతు పొట్లూరి అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు నూజివీడులో సబ్ కలెక్టర్‌కు సోమవారం మీకోసంలో అర్జీ దాఖలు చేశారు. అశోక్ మాట్లాడుతూ సుమారు 150 మంది రైతుల సమస్యను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తరతరాల నుండి సుమారు 150 మంది సన్నా, చిన్న కారు రైతులు పంటలు పండిస్తూ, దిగుబడిని తరలిస్తూ అదే దారిని వినియోగించినట్లు తెలిపారు. ఒక వ్యక్తి రైతు ముసుగులో కొంత భూమిని కొనుగోలు చేసి దారి కట్టడి చేసి 150 మంది రైతులను అనేక ఇబ్బందులకు గురిచేయడం ఎంతో బాధ కలిగిస్తుందన్నారు. న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా దారిని విడవమని కోరుతున్నట్లు చెప్పారు. నాలుగు గజాల స్థలం దారి కోసం కొనుగోలు చేస్తామన్న కబ్జా చేసిన వ్యక్తి ఒప్పుకోవడం లేదని వాపోయారు. ఇదే విషయమై రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. న్యాయమైన తమ పోరాటం విజయం సాధించేవరకు విడిచేది లేదని స్పష్టం చేశారు.

రూ.550 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

ప్రజాశక్తి - చింతలపూడి

ఒప్పంద పత్రాలు చూపిస్తున్న ఎంఎల్ఎ

విశాఖపట్నంలో జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో యూకేకు చెందిన పెట్టుబడుదారులు 550 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోగలిగామని ప్రతినిధి బృందం చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఎ రోషన్ కుమార్‌ని హైదరాబాదులో కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. ఈ బృందంతో ఎంఎల్ఎ రోషన్ కుమార్ తరచూ సమావేశాలు జరిపి వారిని ఐటీలో పెట్టుబడులు పెట్టాలని ప్రోత్సహించి, ఈ సదస్సులో భాగస్వామ్యం కల్పించడంతో శనివారం ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పంద సమయంలో యుకె ప్రతినిధులు ఎంఎల్ఎ రోషన్ కుమార్ ప్రోత్సాహంతోనే తాము ఈ సదస్సులో పాల్గొన్నట్లు ఐటీ మంత్రి నారా లోకేష్ తో వివరించారు. మీ తోడ్పాటుతోనే సిఐఐ భాగస్వామ్య సదస్సులో 550 కోట్లు పెట్టుబడులు పెట్టడానికి అవకాశం లభించినట్లు వారు తెలిపినట్లు ఎంఎల్ఎ తెలిపారు. ఈ పెట్టుబడులు ఐటి, బయో సస్టయిన్ రంగాల్లో పెట్టనున్నట్లు ఈ బృందం ప్రతినిధి అశోక్ పేర్కొన్నారు. యుకేకు తిరుగు పయనమైన బృందానికి ఎంఎల్ఎ వీడ్కోలు పలికారు.

శిథిలావస్థ పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపిపి

మండలంలోని పెదకామనపూడి పంచాయతీ పరిధిలోని (తూర్పుపాకల)లో మొంథా తుపాను కారణంగా శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తుపాను కారణంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలపై చెట్టుపడి పూర్తిగా ధ్వంసమైందన్నారు. పాఠశాల విద్యార్థుల నిర్వహణకు ఇబ్బంది లేకుండా పక్కనే వున్న కమ్యూనిటీ హాల్‌లో బోధన నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కమ్యూనిటీ హాల్ రిపేర్ నిమిత్తం మండల పరిషత్ నిధులు కేటాయించామన్నారు. పాఠశాల మొత్తం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, టాయిలెట్స్ గదులు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలను అధికారులతో మాట్లాడి నూతన పాఠశాలను నిర్మించేలాగా చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయులు అనగాని నాగమల్లేశ్వరరావు, ఎం.నాగరాజ కుమార్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.రామకృష్ణ, పిఆర్ఎఇ ఎమ్‌డి సాదిక్ పాషా, గ్రామ సర్పంచి సైడాల శ్రీను, ఎంపిటిసి సభ్యులు పల్లి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి కె.విజయ్ బాబు, షేక్ ఇమామ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర పరిసరాలు అంటువ్యాధులకు ఆవాసాలు

డాక్టర్ మానస, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలూరు సిటీ : అపరిశుభ్ర పరిసరాలు అంటువ్యాధులుకు ఆవాసాలని, పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రతని, సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందంగా జీవించవచ్చని ఏలూరు మోతేవారి తోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు మోతేవారి తోట 5వ రోడ్‌లో ప్రజలకు ఫ్రైడే డ్రై డే పరిసరాల పరిశుభ్రత ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ వర్షాకాలంలో వర్షాలు అధికంగా పడడం వల్ల కీటకాలు అభివృద్ధి చెంది, ముఖ్యంగా దోమలు, ఈగలు ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసారా, కామెర్లు, టైఫాయిడ్ మొదలగు అనారోగ్య సమస్యలతో బాధపడే అవకాశం ఉందని అన్నారు. ముఖ్యంగా దోమలు పెరగకుండా ఇంటి పరుషాలు, పల్ల ప్రాంతాలు మట్టితో పూడ్చుకోవాలని సూచించారు. సాధారణంగా మనం వాడే తొట్టెలు, డ్రమ్ములు ఓవర్ ట్యాంకులు వారానికి ఒకసారి కడిగి మూతలు పెట్టుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టుకోవచ్చని అన్నారు. మురికి కాలువలో చెత్త వేయరాదని సూచించారు. అలాగే ఈగల అభివృద్ధి ఇంటి పరిసరాల్లో చెత్త పోగులు, పేడ పోగులు పెట్టరాదని సూచించారు. అనంతరం డెంగీ, మలేరియా పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, అయ్యప్ప వీరాస్వామి, ఆరోగ్య కార్యకర్తలు, యుపిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

'మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి'

చింతలపూడి : స్థానిక చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబర్ 13వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. మంగళవారం కోర్టు ఆవరణలో పోలీస్ ఆఫీసర్స్‌తో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్ సివిల్ బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, బిఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి, జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్స్ టి.క్రాంతి కుమార్, ఎంవి.సుభాష్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్, చింతలపూడి, టి.నర్సాపురం, ధర్మాజీగూడెం, తడికలపూడి సబ్ ఇన్‌స్పెక్టర్స్, కోర్ట్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి డబుల్ ఫ్రీజర్ అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఎంపీ లాడ్స్ నుండి మార్చురీకి డబుల్ ఫ్రీజర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.పద్మజారాణి మాట్లాడుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఇచ్చిన హామీ మేరకు ఎంపీ లాడ్స్ నుండి మార్చురీకి డబుల్ ఫ్రీజర్‌ను అందించినట్లు చెప్పారు. ఫ్రీజర్ ఇన్‌స్టాలేషన్ చేయడంతో అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇప్పటివరకు మృతదేహాలను ఉంచేందుకు ఫ్రీజర్ లేకపోవడంతో నియోజకవర్గంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫ్రీజర్ ఇన్‌స్టాలేషన్ చేయడంతో ఇబ్బందులు తొలగి, పేద కుటుంబాలలోని వారికి సౌకర్యంగా ఉంటుందని పలువురు సామాజికవేత్తలు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగేంద్ర వర ప్రసాద్ అరెస్ట్‌ను ఖండిస్తున్నా

మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి

ప్రజాశక్తి - దెందులూరు

పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేసిన ధూళిపాళ నాగేంద్ర వరప్రసాద్ అరెస్టును ఖండిస్తూ, ఆయనపై వచ్చిన ఆరోపణలన్నీ ఎప్పుడో ఎనిమిది, పదేళ్ల క్రితం మధ్య జరిగిన వ్యవహారాలకు సంబంధించినవని తమకు సమాచారం ఉందని, ఆ సమయంలో టిడిపి ప్రభుత్వమే అధికారంలో ఉండగా, ప్రస్తుత ఎంఎల్ఎ చింతమనేని అప్పుడు కూడా శాసనసభ్యులుగా ఉన్నారని దెందులూరు మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి పేర్కొన్నారు. అప్పట్లో పట్టించుకొని నాయకులు నాగేంద్ర వరప్రసాద్ టిడిపిని వీడి, వైసిపిలో చేరినందుకు కక్ష కట్టి ఇప్పుడు కుట్రలు పన్నుతున్నారని, అరెస్ట్ పేరుతో 70 ఏళ్ల వయసు ఉన్న ఆయన్ని నిన్నటి నుంచి పోలీస్ స్టేషన్‌లో ఉంచడం అన్యాయమని ఆయన చెప్పారు. ఇలాంటి కేసులకు వైసిపి నాయకులు, కార్యకర్తలు భయపడరని, తాను భజ్జీకి, పార్టీ నాయకులకు అండగా నిలబడతానని అబ్బయ్య చౌదరి ప్రకటనలో పేర్కొన్నారు.

నర్సింగ్ కళాశాలలో జాతీయ మూర్ఛవ్యాధి దినోత్సవం

దెందులూరు : బిఆర్ అండ్ డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో జాతీయ ఎపిలెప్సి డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థులు టి.శృతి, ఎన్.దివ్య మాట్లాడుతూ ఎపిలెప్సీను ఫిట్స్ అని కూడా అంటారన్నారు. నవంబర్ 17న జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం అయినప్పటికీ దీనికి ప్రత్యేకమైన ఊదా రంగు డే అని కూడా అంటారన్నారు. ఎందుకంటే లావెండర్ మూర్ఛ వ్యాధికి అంతర్జాతీయ చిహ్నంగా పరిగణించబడుతుందని, 2008లో కాసిడి మేఘాన్ అనే యువతి పర్పుల్ డేను ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయనవి

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామ కాపురస్తుడైన పలివెల రామకృష్ణ రవికుమార్ S/o.పలివేల సత్యనారాయణ అను నేను 7-11-2025 తేదీన కైకరం గ్రామంలో మా ఇంటి వద్ద నుండి ఉంగుటూరు సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో భీమడోలు సబ్ రిజిస్ట్రర్ వారి కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన నాకు చెందిన క్రయ దస్తావేజు నెంబర్ 3650/2021 గల ఒరిజినల్ దస్తావేజులు కల బ్యాగు జారిపడిపోయినది. ఎవరికైనా దొరికినయెడల ఈ క్రింది చిరునామాకు సంప్రదించగలరు.

గుత్తికొండ శ్రీనివాస్, అడ్వకేట్ కైకరం,
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 9848050089

గ్రామపంచాయతీ కార్యాలయం - గణపవరం

ఆర్.ఓ.సి.నెం.22/2025 **టెండరు ప్రకటన** **తేది.15.03.2025**

గణపవరం మండలం, గణపవరం గ్రామ పంచాయతీ నందు **1 సంవత్సరమునకు** అనగా **ది.01-04-2025 నుండి ది.31-03-2026** వరకు గల కాలమునకు ఈ దిగువ ఉదహరించిన పనులను కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించు నిమిత్తం టెండరులు పిలువడమైనది. టెండరులు **ది.20.03.2025వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటల వరకు** గ్రామ పంచాయతీ కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శికి స్వయముగా గానీ లేక వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 2-30 గంటలకు హాజరుగా ఉన్న టెండరుగార్ల సమక్షములో తెరువబడును. టెండరు షెడ్యూలు వివరములు కార్యాలయము పని వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు - 1

వ. నెం.	పని వివరము	వినియోగించవలసిన వ్యక్తుల సంఖ్య	ధరావత్తు
1.	పారిశుద్ధ్య నిర్వహణ: గ్రీన్ అంబాసిడర్స్-17, గ్రీన్ అంబాసిడర్ (షెడ్)-1, పారిశుద్ధ్యం -15	33	రూ.50/-(1కి)
2.	పి.డబ్ల్యూ.యస్.స్కీము నిర్వహణ	8	రూ.50/-(1కి)
3.	వీధి నిర్వహణ దీపములు నిర్వహణ	3	రూ.50/-(1కి)
		44	

షెడ్యూలు -2

వ.నెం.	పని వివరము	కాల పరిమితి	ధరావత్తు
1.	ప్రజారోగ్య సామగ్రి సప్లయి చేయుటకు	2025-2026	రూ.500/-లు
2.	ఎలక్ట్రికల్ విడి భాగములు సప్లయి చేయుటకు	2025-2026	రూ.500/-లు
3.	పి.డబ్ల్యూ.యస్.స్కీము సామాగ్రి సప్లయి చేయుటకు	2025-2026	రూ.500/-లు
4.	స్టేషనరీ సామానులు సప్లయి చేయుటకు	2025-2026	రూ.500/-లు

కార్యదర్శి వారి నోటు : షెడ్యూలులో సదరు పోస్టులకు గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, గణపవరం.